క్లుప్తంగా

పాఠశాల వద్ద ఆందోళన

ఖమ్మం సహకారనగర్: నగరంలోని రోటరీనగర్‌లో గల ఓ ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులను ఉపాధ్యాయులు కొట్టారని ఆరోపిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల వద్ద గురువారం ఆందోళన చేశారు. విద్యార్థులను కావాలనే కొట్టారని తల్లిదండ్రులు చెబుతుండగా.. క్రమశిక్షణలో ఉంచేందుకే మందలించారని యాజమాన్యం తెలిపింది. కాగా, పోలీసులు పాఠశాల వద్దకు వెళ్లగా.. ఇరు వర్గాల వారు ఖమ్మం టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

క్రీడాకారులకు టీషర్ట్స్ అందజేత

కామేపల్లి: మండలంలోని పాన్నేకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని క్రీడాకారులకు బర్లగూడెం ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యాన టీషర్ట్స్ అందించారు. ఈ సదర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు బానోత్ వీరునాయక్ మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. అలాగే పాఠశాలలో గ్రంథాలయ, వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బానోత్ పాపాలాల్, హెచ్‌ఎం కోటేశ్వరమ్మ, మాలోత్ రామారావు, రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

తిరుమలాయపాలెం: మండలంలోని సుబ్లేడు, సోలిపురం, సుద్దవాగుతండా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను గురువారం బీరోలు సొసైటీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు రామసహాయం నరేష్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ ఉపసర్పంచ్ వెంకటనారాయణ, సుమన్‌రెడ్డి, నాగరాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని బలోపేతం చేయాలి

నేలకొండపల్లి: ప్రభుత్వ విద్యా రంగాన్ని బలోపేతం చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వై.వెంకటేశ్వరరావు కోరారు. మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించాక ఆయన మాట్లాడారు. పెండింగ్ డీఏలను విడుదల చేయాలని, పీఆర్‌సీ తక్షణమే అమలు చేయాలని, సీపీఎస్ విధానాన్ని రద్దుచేయాలని కోరారు.

ముగిసిన మండల స్థాయి క్రీడా పోటీలు

నేలకొండపల్లి: మండలంలోని బోదులబండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. ఈ పోటీల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలు నిర్వహించగా.. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొని ఆడారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి చలపతిరావు, సీఆర్‌పీలు ప్రసాద్, వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం జానకిరామ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి నివాళి

నేలకొండపల్లి/ఖమ్మంవన్‌టౌన్/ఖమ్మంలీగల్/ఖమ్మంసహకారనగర్/ఖమ్మంరూరల్: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి పలువురు నాయకులు తమ సంతాపం ప్రకటించి, ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. గురువారం ఈమేరకు సంతాప సభ నిర్వహించి ఆయన మరణం పార్టీకి తీరనిలోటని పేర్కొంటూ ఏచూరి సేవలను కొనియాడారు. నివాళులర్పించిన వారిలో నేలకొండపల్లి మండల కార్యదర్శి కే.వీ.రెడ్డి, ఏటుకూరి రామారావు, రచ్చా నరసింహారావు, పార్టీ రాష్ట్ర ఓబీసీ విభాగం ఉపాధ్యక్షుడు వడ్డెబోయిన నర్సింహారావు, దాసరి పూర్ణ, ఎస్ రాధాకృష్ణ, ఎం నాగభూషణం, కొల్లి సత్యనారాయణ, మండడపు శ్రీనివాసరావు, వై.శ్రీనివాసరావు, మీసాల వెంకటేశ్వర్లు, టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీవీ నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పాలేరు డివిజన్ కార్యదర్శి బందెల. వెంకయ్య తదితరులు ఉన్నారు.

రిటైర్డ్ ఎస్‌ఐకు..

ఖమ్మం క్రైం: నగరంలోని మధురానగర్‌కు చెందిన రిటైర్డ్ ఎస్‌ఐ షేక్ మన్సూర్ అలీ మృతిచెందగా గురువారం మాజీ ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్, జిల్లా పోలీస్ సంఘం బాధ్యులు ఆయన భౌతికాయానికి పూల మాల వేసి నివాళులర్పించారు. . అదే విధంగా ఇటీవల మరణించిన హెచ్‌సీటి. పున్నయ్యకుటుంబ సభ్యులనూ పరామర్శించారు. ఈకార్యక్రమంలో జిల్లా పోలీస్ సంఘం అధ్యక్షుడు రాధాకృష్ణ, కార్యదర్శి రుద్ర వెంకటనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	సరిపోదా శనివారం
వినోద	ద గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైం
సాయిరాం	భలే ఉన్నాడే!
ఆదిత్య	అయ్
శ్రీనివాస	35(2024)
సీఎన్ సినీ గెలాక్సీ	కమిటీ కుర్రోళ్లు, డిమాంట్ కాలనీ 2

- ఖమ్మంగాంధీచౌక్



పద్మావతినగర్‌లో ధ్వంసమైన కారు(ఫైల్)

ఇటీవల ఎడతెరపిలేకుండా కురిసిన వర్షాలకు ఖమ్మంతో పాటు పలు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు, లారీలు నీటిలో మునిగిపోయాయి. దీంతో ఆయా వాహనాలకు మరమ్మతులు చేయించుకోవడానికి పైసలు లేకపోవడం, మెకానిక్‌లు బాగుచేయలేమని చెప్పడంతో ఆయా వాహనదారులు ఇన్సూరెన్స్ కంపెనీలను ఆశ్రయిస్తున్నారు. దీంతో ఆయా కంపెనీ ప్రతినిధులు వాహనాలు వరద నీటిలో మునిగిన ఫొటోలు కావాలని, అడ్రస్‌లు తేడా ఉన్నాయంటూ కొర్రీలు పెడుతుండడంతో దిక్కుతోచని స్థితిలో బాధితులు కొట్టుమిట్టాడుతున్నారు.

ఇన్సూరెన్స్ ఇరకాటం..!

మున్నేరు వరదలో నీట మునిగిన పలు వాహనాలు

- మరమ్మతులకు పైసల్లేక ఇన్సూరెన్స్ కంపెనీలను ఆశ్రయిస్తున్న వాహనదారులు
- నీట మునిగిన ఫొటోలు కావాలంటున్న కంపెనీ ప్రతినిధులు
- తలనొప్పిగా చిరునామా వ్యవహారం
- ఇన్సూరెన్స్ ఉన్నా లాభం లేదని ఆందోళన



నీట మునిగిన వాహనాలకు మరమ్మతులు చేస్తున్న మెకానిక్‌లు(ఫైల్)

ఖమ్మం రాపర్తినగర్: మున్నేరు పరీవాహక ప్రాంతంలోని బొక్కలగడ్డ, వెంకటేశ్వరనగర్, మోతీనగర్, పద్మావతినగర్, రామన్నపేట, సారథినగర్, దానవాయిగూడెం, రంగనాయకుల గుట్ట కింద, పెద్దమ్మతల్లి గుడి వెనుక, ప్రకాశ్‌నగర్, మామిళ్లగూడెం, ధంసలాపురం ప్రాంతాలకు చెందిన గృహాలు నీటిలో మునిగిపోయాయి. అయితే ఆయా ప్రాంతాలకు చెందిన వారి వాహనాల్లోకి నీరు పోవడం, దాదాపు రెండు రోజులుగా నీటిలోనే ఉండడంతో అవి పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇంజన్‌లో నీరు చేరుకోవడంతో మెకానిక్‌లు బాగు చేయలేమని చెప్పడంతో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఇన్సూరెన్స్ ఉన్నా మెకానిక్‌లకు చూపించి వాహనాలు నడవడం లేదని లబోదిబోమంటున్నారు.

కొర్రీలు పెడుతున్న కంపెనీలు..

వరద నీటిలో మునిగిన వాహనదారులు తమ వాహనాలను మెకానిక్‌లకు చూపించడం తప్ప ఇన్సూరెన్స్ ఉందా లేదా అనే విషయాన్ని అంతగా ఆలోచించరనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే తాజాగా ఇన్సూరెన్స్ కంపెనీలు మాత్రం నీళ్లలో వాహనం మునిగిందనడానికి ఏమైనా ఫొటోలు ఉంటే చూపించండి అంటూ ఆయా కంపెనీల ప్రతినిధులు ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఆ సమయంలో తమ ప్రాణాలను కాపాడుకోవడమే గగనమైనప్పుడు ఫొటోలు తీయడం ఎలా సాధ్యపడుతుందనే అభిప్రాయాలు వాహనచోదకులు వెల్లడిస్తున్నారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా ఆయా కంపెనీలు వాహనాలకు ఇన్సూరెన్స్ చెల్లంచలేమని చెబుతుండగా.. మరికొన్ని కంపెనీలు ఉన్నతస్థాయి అధికారులతో మాట్లాడాక నిర్ణయం తీసుకుంటామని ఓపికగా చెబుతున్నట్లు తెలుస్తోంది.

మూడు రోజులకుపైగా షోరూంలోనే..

నగరంలోని పలు కంపెనీలకు చెందిన షోరూంల వద్ద వందలాది వాహనాలు ఉంటున్నాయి. వర్షం కారణంగా వాహనాలు పూర్తిగా దెబ్బతినడంతో ఇన్సూరెన్స్ ఉన్న వాహన చోదకులు మరమ్మతులు చేయించడానికి ఇస్తున్నారు. ఒక్క రోజులో ఇవ్వాల్సిన వాహనాలను మూడు రోజుల తర్వాత రావాలని షోరూం నిర్వాహకులు స్పష్టం చేస్తుండడం గమనార్హం.

ఇందులోనూ చిక్కులే..

ఇన్సూరెన్స్‌లో అడ్రస్ ఒక చోట, ప్రస్తుతం నివాసం ఉండేది ఒక చోట కావడంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం మున్నేరు పరీవాహకప్రాంతంలో అద్దెకు ఉంటున్న వాహనచోదకులు తమ సొంత ఊరి అడ్రస్ ఇన్సూరెన్సు కంపెనీలో ఉండడంతో పెద్ద తలనొప్పిగా మారిందని ఆయా కంపెనీలు పేర్కొంటున్నాయి. అదే పరీవాహక ప్రాంతంలో ఉండి నీట మునిగితే కంపెనీలు భరించాలని, ఇప్పుడు లేనిపోని కొర్రీలు పెట్టడం సరికాదని వాహనదారులు మండిపడుతున్నారు.

పూజలు.. అన్నదానాలు..



ఖమ్మంగాంధీచౌక్: సాయిబాబా మందిరంలో మహా అన్నదానం



రోటరీనగర్‌లో అన్నదానం చేస్తున్న దృశ్యం

ఖమ్మంఅర్బన్/ఖమ్మంగాంధీచౌక్: వినాయక చవితిని పురస్కరించుకుని పలు ఉత్సవ కమిటీల ఆధ్వర్యాన గురువారం గణేషుడికి ప్రత్యేక పూజలు, హోమాలు, అన్నదానాలు చేశారు. ఈ నేపథ్యాన రోటరీనగర్‌లో శ్రీరాజరాజేశ్వర అమ్మవారి గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన, ఖానాపురం హవేలీ విజయ్‌నగర్ కాలనీ షిర్డీ సాయిబాబా మందిరంలో మహా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వినాయక విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.



మండపంలో గణనాథుడు

కేంద్ర బృందానికి వినతి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం వరద బాధితుల సహాయార్థం కేంద్ర ప్రభుత్వం తరఫున పరిశీలనకు ఖమ్మం వచ్చిన నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ సలహాదారుడు, కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ కల్నల్ ప్రతాప్‌సింగ్ బృందాన్ని బీజేపీ నాయకులు గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నున్నా రవికుమార్, రాష్ట్ర నాయకుడు గెంటెల విద్యాసాగర్‌లు పంటలు నష్టపోయిన రైతులు, వరద బాధితులను ఆదుకోవాలని కోరారు. గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు రవిరాథోడ్, ప్రధాన కార్యదర్శి జాటోత్ మోహన్, బీజేపీ త్రీటౌన్ ప్రధాన కార్యదర్శి అంకిత పాపారావు, నాయకులు దార్ల శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

దెబ్బతిన్న రోడ్ల పరిశీలన

నేలకొండపల్లి: ఇటీవల కురిసిన వర్షాల వలన మండలంలోని పలు గ్రామాల్లో దెబ్బతిన్న రహదారులను ఎంపీడీఓ ఎం.యర్రయ్య గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనాలు, ప్రజల రాకపోకలకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదే విధంగా ఆయా పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలన్నారు. వరదల సమయాన అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి శివ, పంచాయతీరాజ్ ఏఈ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీఆర్‌ఓగా అయూబ్ ఖాన్

ఖమ్మం సహకారనగర్: డీపీఆర్‌ఓ కార్యాలయ అడిషనల్ పీఆర్‌ఓ(ఏపీఆర్‌ఓ)గా ఎండీ అయూబ్‌ఖాన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. పెద్దపల్లి జిల్లా డీపీఆర్‌ఓ కార్యాలయంలో ఏపీఆర్‌ఓగా పని చేస్తున్న ఆయనను డిప్యూటేషన్‌పై ఖమ్మంకు కేంటాయించారు.

కాంగ్రెస్ సీనియర్ నాయకుడి మృతి

కామేపల్లి: మండలంలోని తాళ్లగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మద్దినేని అనంతరామయ్య అనారోగ్యంతో మృతి చెందగా గురువారం ఆయన మృతదేహానికి వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి వెంట మండలాధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి, నల్లమోతు లక్ష్మయ్య, వివిధ పార్టీల నాయకులు నివాళులర్పించారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



సభ్యత్వ నమోదు ప్రారంభిస్తున్న సుధాకర్

నేలకొండపల్లి: బీజేపీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పాగర్తి సుధాకర్ పిలుపునిచ్చారు. మండలంలోని పైనంపల్లిలో గురువారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పంచాయతీ ఎన్నికలలో పార్టీ సత్తా చాటేలా ప్రతీ బూత్‌లో 200 మంది సభ్యత్వం చేర్పించాలన్నారు. రుణమాఫీ విషయంలో ప్రభుత్వం తీరుపై రైతులు మండిపడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి సూరేపల్లి జ్ఞానరత్నం, సతీష్, చల్లగుండ్ల నరసింహారావు, కందరబోయిన గోపి తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్లపై సర్వే..



వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

కూసుమంచి: ఇటీవల వచ్చిన వరదల్లో కొట్టుకుపోయిన లేదా పాడైన సర్టిఫికెట్లు, డాక్యుమెంట్లపై కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం అధికారులు సర్వే చేపట్టారు. ఏపీఓ అప్పారావు, ఐకేపీ ఏపీఎం సత్యవర్ధన్‌రాజు ఆధ్వర్యాన సర్వే చేపట్టగా మండలంలో 417 ఇళ్లలో 14 కుటుంబాలకు చెందిన సర్టిఫికెట్లు, డాక్యుమెంట్లు, పట్టాదారు పాస్ పుస్తకాలు పాడైనట్లు అధికారులు గుర్తించారు. ఇట్టి వివరాలను కలెక్టర్‌కు నివేదించనున్నట్లు ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు.

మత్స్యకారులకు నష్ట పరిహారం అందించాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఖమ్మంఅర్బన్: ధంసలాపురం పెద్ద చెరువులో వరదలు వచ్చి చేపలు మృత్యువాత పడ్డాయని, మత్స్యకారులకు నష్ట పరిహారాన్ని చెల్లించి ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, కొత్తగూడెం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నాయకులు కోరారు. ఈమేరకు గురువారం అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, ఫిషరీస్ ఏడీలకు వినతిపత్రాలు సమర్పించారు. అనంతనం హేమంతరావు మాట్లాడుతూ.. ఈ ఏడాది జూన్‌లో ఖమ్మంలోని మురుగు నీరంతా కొత్తగూడెం, ధంసలాపురం పెద్ద చెరువులో కలిసి నీరు కలుషితమై చేపలు మృతి చెందాయన్నారు. ఆ సమయాన జిల్లా మత్స్య శాఖ ఏడీ చెరువును పరిశీలించి, కార్పొరేషన్ ద్వారా నష్ట పరిహారం అందిస్తామని చెప్పి నేటికీ ఇవ్వలేదన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మత్స్యశాఖ ఏడీకి కూడా సమస్యను వివరించినట్లు తెలిపారు. గతంలో ఇస్తామన్న రూ.12లక్షల నష్ట పరిహారంతో పాటు ఇటీవల వర్షాలతో నష్టపోయిన రూ.23 లక్షలను ప్రభుత్వం ద్వారా వెంటనే అందించాలని కోరారు. అదే విధంగా చెరువు అలుగుల వద్ద పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పగడాల మల్లేష్, మత్స్య సొసైటీ అధ్యక్షుడు ముద్రబోయిన అప్పారావు, ఉపాధ్యక్షుడు పగడాల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పోతురాజు వెంకటేశ్వర్లు, మాజీ అధ్యక్షులు పర్వత సైదులు, రావుల హన్మంతరావు, ప్రతానపు రామనాథం తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో | వేగంగా సహాయక చర్యలు

- 980 మంది పారిశుద్ధ్య కార్మికులతో పని చేయించాం
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మంమయూరిసెంటర్: ముంపు ప్రాంతాల ప్రజలకు సహాయ, పునరావాస చర్యలు వేగంగా చేపట్టినట్లు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలో ఇటీవల భారీ వర్షాలు, వరదల కారణంగా మొత్తంగా 13 డివిజన్లలో నష్టం వాటిల్లిందని ఆయన చెప్పారు. కలెక్టర్ గురువారం మీడియాతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. వరద ప్రభావిత డివిజన్ల నుంచి 7,700 మంది కోసం ఐదు చోట్ల పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేసి తొమ్మిది రోజుల పాటు భోజనం సమకూర్చామని, 13 శిబిరాల ద్వారా ఫీవర్ సర్వే చేపట్టామని తెలిపారు. బాధితులకు 28వేల నిత్యావసర వస్తువులు, బ్లాంకెట్లు, దుస్తులు పంపిణీ చేసినట్లు కలెక్టర్ చెప్పారు. ఇక 14 బృందాల ద్వారా దెబ్బతిన్న ఇళ్లు, నష్టంపై సర్వే పూర్తయిందని తెలిపారు. కాగా, 980 మంది పారిశుద్ధ్య కార్మికులతో పనులుచేయించామని, ఇందులో 37 జేసీబీలు, 60 ట్రాక్టర్లు, 59 వాటర్ ట్యాంకర్లు, 30 స్వచ్ఛ ఆటోలు వినియోగించామని తెలిపారు. వరదలతో దానవాయిగూడెం ఇన్ టేక్‌వెల్ దెబ్బతినగా ప్రత్యామ్నాయంగా559 బోర్లు, 78 పవర్ బోర్లు, వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయించామని వివరించారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం బ్లీచింగ్ చల్లడంతో పాటు నీటి నిల్వల వద్ద ఆయిల్ బాల్స్ వేయిస్తున్నామని, సాంస్కృతిక సారథి కళాకారులు, మెప్మా, ఆశా వర్కర్లతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కాగా, వరద కారణంగా సర్టిఫికెట్లు, విలువైన పత్రాలు కోల్పోయిన వారికి తిరిగి అందించేలా ఎనిమిది శిబిరాల్లో దరఖాస్తుల స్వీకరిస్తున్నామని కలెక్టర్ వివరించారు.

ఎమ్మెల్సీ కోదండరాం విస్తృత పర్యటన



కూసుమంచి: యాకూబ్ కుమారుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోదండరాం

ఖమ్మం సహకారనగర్/ కూసుమంచి/ ఖమ్మంరూరల్: ఖమ్మం నగర పర్యటనకు విచ్చేసిన ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం ఖమ్మం నగరంతో పాటు వరద తాకిడికి గురైన కూసుమంచి, ఖమ్మంరూరల్ మండలాల్లో గురువారం విస్తృతంగా పర్యటించారు. తొలుత ఖమ్మం వచ్చిన ఆయనకు తెలంగాణ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ షౌకత్ అలీ, పూర్వ వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గరికె ఉపేందర్, ఉద్యోగ సంఘం నాయకుడు నందగిరి శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో నగర సరిహద్దు కోదాడ క్రాస్‌రోడ్డు వద్ద పూలమాలతో ఘన స్వాగతం పలికి వీఆర్వోల సంక్షేమ సంఘం రాష్ట్ర శాఖ పక్షాన పలు సమస్యలపై వినతి పత్రం అందించారు. అలాగే కూసుమంచిలో పాలేరు రిజర్వాయర్ వరదల్లో మృతిచెందిన షేక్ యాకూబ్, సైదాబీ కుమారులను, ఖమ్మంరూరల్ మండలంలోని రాజీవ్‌గృహకల్పలో వరద బాధితులను ఆయన పరామర్శించి, మనోధైర్యం నింపారు. ఈ కార్యక్రమంలో టీఎస్టీఓ నేతలు ఆర్‌వీఆర్ సాగర్, శ్రీను, సీపీఎస్ నేత శశిధర్, టీజీఓ మాజీ అధ్యక్షుడు ఖాజామియా, వజ్జ రామారావు, రాజారత్నం, తెలంగాణ జనసమితి జిల్లా ఇన్‌చార్జ్ గోపగాని. శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

‘వరద’లా సాయం..



ఖమ్మంమయూరిసెంటర్: శ్రీవైష్ణవ కుటుంబాలకు కిట్లు అందజేస్తున్న దృశ్యం



ఖమ్మం సహకారనగర్: పుస్తకాలు అందిస్తున్న రెజొనెన్స్ డైరెక్టర్ నాగేంద్రకుమార్



ఖమ్మంగాంధీచౌక్: నిత్యావసరాలను అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు




తిరుమలాయపాలెం: రాకాసితండాలో నిత్యావసర వస్తువులు అందిస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు



ఖమ్మం మామిళ్లగూడెం: పర్వీన్‌కు ల్యాప్‌టాప్ అందిస్తున్న జమాతె ఇస్లామి హింద్ బాధ్యులు

- ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్నేరు వరద ప్రవాహంలో నిరాశ్రయులైన సుమారు 30 శ్రీ వైష్ణవ కుటుంబాలకు రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర నెలకు సరిపడా కిరాణ సామగ్రి, కిట్లు అందజేశారు. బాధిత కుటుంబాల దుస్థితిని శ్రీ వేంకటేశ్వర చాత్తాద శ్రీ వైష్ణవ సేవా సమితి రాష్ట్ర కమిటీ ప్రతినిధులు హైదరాబాద్‌లో ఎంపీకి కలిసి వివరించాగా.. ఆయన స్పందించి క్యాంపు కార్యాలయ సిబ్బంది ద్వారా గురువారం అందించారు.
- ఖమ్మం సహకారనగర్: మున్నేరు వరద తాకిడికి గురైన 25 మంది రేషన్ డీలర్లకు జిల్లాలోని రేషన్ డీలర్ల అసోసియేషన్ ఆధ్వర్యాన కాంగ్రెస్ పార్టీ నాయకుడు తుంబూరు దయాకర్ రెడ్డి చేతుల మీదుగా నిత్యావసరాలు అందజేశారు. అలాగే రెజొనెన్స్ కళాశాల ఆధ్వర్యాన వరద ముంపు బాధిత విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలు, తదితర మెటీరియల్‌ను అందించినట్లు డైరెక్టర్లు ఆర్‌వీ నాగేంద్ర కుమార్, కె.శ్రీధర్‌రావులు తెలిపారు. అంతేకాక ఎస్‌బీఐటీ కళాశాల ఆధ్వర్యాన నగరంలోని సారథినగర్, జూబ్లీపుర పాఠశాలలతో పాటు వెంకటేశ్వరనగర్‌లోని పాఠశాలల విద్యార్థులు సుమారు 200 మందికి నోట్ పుస్తకాలు అందించినట్లు చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు.
- ఖమ్మం మామిళ్లగూడెం/ఖమ్మంరూరల్: మున్నేరు వరద ముంపునకు గురైన సారథినగర్‌కు చెందిన గ్రూప్–1 మెయిన్స్‌కు ప్రిపేర్ అవుతున్న ఇశ్రత్ పర్వీన్‌కు జమాతె ఇస్లామి హింద్ ఆధ్వర్యాన ఖమ్మం సంఘ కార్యాలయంలో ల్యాప్‌టాప్‌తో పాటు ప్రింటర్ అందజేశారు. అలాగే ముంపునకు గురైన వారికి నిత్యావసరాలను రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఖాలిద్ ముబష్శిర్ ఉజ్‌జాఫర్ అందజేశారు. అంతేకాక సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి ఆదేశాల మేరకు ఖమ్మంలోని బొక్కలగడ్డ, కరుణగిరి, రాజీవ్ గృహకల్పలో 250 మంది బాధితులకు కారుణ్య మూర్తి రెడీమెడ్స్ కల్లూరు వారి సహకారంతో పేబ్యాక్ టు ది సొసైటీ ఆధ్వర్యాన వస్త్రాలు పంపిణీ చేశారు.
- ఖమ్మంగాంధీచౌక్: కలెక్టర్ పిలుపునిచ్చిన ‘నా ఖమ్మం కోసం నేను’కు స్పందించిన లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం ప్రతినిధులు ముందుకొచ్చి మున్నేరు వరద బాధితులకు గురువారం స్థానిక వాసవీ గార్డెన్స్‌లో రూ.12 లక్షల విలువైన నిత్యావసరాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. అంతర్జాతీయ లయన్స్ క్లబ్, 320ఏ జిల్లా గవర్నర్ కోటేశ్వరరావులు డిజాస్టర్(విపత్తు) రిలీఫ్ ఫండ్ పేరిట నిధులు విడుదల కాగా కార్యక్రమాన్ని 320ఈ జిల్లా గవర్నర్ యారాల ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించి బాధితులకు అందించారు. అదేవిధంగా నగరంలోని మోతినగర్, పంపింగ్‌వెల్‌రోడ్, మంచికంటినగర్, బొక్కలగడ్డ, సుందరయ్యనగర్ తదితర వరద బాధితులకు హర్కారా బావి రోడ్ రంగనాయకుల గుట్ట శ్రీ కృష్ణ సాయి ఆశ్రమం ఆధ్వర్యాన 200 బకెట్లు, మగ్గులు పంపిణీ చేశారు.
- తిరుమలాయపాలెం: ఆకేరు వరదలతో సర్వస్వం కోల్పోయిన రాకాసితండావాసులకు బీరోలు సొసైటీ చైర్మన్ రామసహాయం నరేష్‌రెడ్డి ఆధ్వర్యాన క్వీన్స్ ఆఫ్ రెడ్డీస్ కిట్టి గ్రూప్ ఖమ్మం వారు నిత్యావసర సరుకులు, వంట సామగ్రి, బెడ్ షీట్లు అందజేశారు.
- ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మం ఫిట్ పోలీస్ రన్నర్స్ ఆధ్వర్యాన ఖమ్మం రూరల్ మండల పరిధిలో వరద బాధితులకు ఖమ్మం రూరల్ తహసీల్దార్ రాంప్రసాద్ చేతుల మీదుగా వెయ్యి టీషర్ట్‌లను పంపిణీ చేశారు.
- ఖమ్మంరూరల్: మండలంలోని రాజీవ్‌గృహకల్ప వరద బాధితులకు మధిరకు చెందిన పారుపల్లి వెంకటేశ్వరరావు, సత్యాంబ ట్రస్ట్ ఆధ్వర్యాన రూ. 2వేలు విలువైన నిత్యావసరాలను 100 మందికి పంపిణీ చేశారు.

తెగిన రోడ్డుకు మరమ్మతులు..



పైపులు వేస్తున్న దృశ్యం

రఘునాథపాలెం: మండలంలోని కోయచలక-కోటపాడు మధ్య తారు రోడ్డు వరద ప్రభావానికి తెగి రాకపోకలు నిలిచిపోగా.. గురువారం మరమ్మతు పనులు ప్రారంభించారు. తొలుత భారీ వర్షానికి పంట పొలాల నుంచి వచ్చిన వరద నీటితో రోడ్డు తెగిపోగా ఆర్‌అండ్‌బీ అధికారులు తాత్కాలికంగా రవాణా ఇబ్బంది లేకుండా పైపులు వేసి మట్టితో నింపి రాకపోకలను పునరుద్ధరించారు. మూడు రోజుల తర్వాత కురిసిన వర్షానికి పైపులు సైతం కొట్టుకుపోయి రాకపోకలు మళ్లీ నిలిచాయి. దీంతో అధికారులు మళ్లీ పైపులు వేయించి మట్టి పోయించారు.